ప్రభుత్వం ఏం సాధించిందని విజయోత్సవాలు


కరపత్రం విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి

కూకట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ గ్యారంటీల గారడీతో 6 అబద్ధాలు, 66 మోసాలు చేసిందని, ప్రభుత్వం ఏం సాధించిందని విజయోత్సవ సభలు నిర్వహిస్తుందని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి ఎస్.మల్లారెడ్డి ప్రశ్నించారు. జిల్లా అర్బన్ శాఖ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో ప్రభుత్వ మోసాలు, అబద్ధాలపై కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భ ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అనేక హామీలు ఇచ్చి, వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మారింది పాలకులే తప్పా పాలన కాదు అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయినేని సూర్యప్రకాష్‌రావు, అర్మనపల్లి సూర్యరావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సురేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, నాయకులు శ్రీధర్, శివరాత్రి దామోదర్, శ్రీకర్‌రావు, మూసాపేట డివిజన్ కార్పొరేటర్ మహేందర్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షపునీరు వెళ్లేలా ఏర్పాట్లు

మోతీనగర్: అధికారులతో మాట్లాడి వర్షపు నీరు వెళ్లేలా ఏర్పాటు చేయిస్తామని కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రినగర్‌లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్వత్ నగర్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ముందు నుంచి గాయత్రినగర్ హరిహర టెంపుల్ వైపు వెళ్లే రహదారి మొత్తం వర్షపు నీరు, మంచినీటి సరఫరా వచ్చినప్పుడల్లా రోడ్లు జలమయంగా మారుతున్నాయని కాలనీ వాసులు తెలిపినట్లు పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసమే కాలనీలో పర్యటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, సంజీవ, జాహిద్ షరీఫ్ బాబా, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్ యాదవ్, సాంబయ్య, యోగి రాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.


కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సబిహాబేగం

9ఏఎం ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభం


ఫెర్టిలిటీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్‌రావు

మూసాపేట: కేపీహెచ్‌బీలోని అంకుర హాస్పిటల్‌లో 9 ఏఎం ఫెర్టిలిటీ సెంటర్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 9 ఏఎం ఫెర్టిలిటీ, అంకుర హాస్పిటల్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్‌రావు పున్నం మాట్లాడుతూ.. ఈ సదుపాయం లెవెల్ 2 ఐవీఎఫ్ కేంద్రమని, సరికొత్త సాంకేతికతను జోడించి సమగ్ర సంతానోత్పత్తి సేవలను అందించడానికి రూపొందించబడిందని తెలిపారు. 9 ఏఎం అనేది అన్ని వంధ్యత్వ అవసరాలకు ఏకీకృత పరిష్కారమన్నారు. ప్రస్తుతం సంతానలేమి కోసం చాలా అవసరమైన పరిష్కారాలను అందిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఇతర ప్రాంతాలకు విస్తరించడానికి ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్ బోయిన్‌పల్లి: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట ప్రభుత్వ పాఠశాలలో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్, సిర్సస్ ల్యాబ్ సంస్థల సహకారంతో 8 కంప్యూటర్లతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించాలనే లక్ష్యంతో కంప్యూటర్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. దాతల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యుత్ బిల్లుల సమస్య తలెత్తడంతో సొంత నిధులతో సోలార్ సిస్టం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంవత్సరంలో రూ.40 లక్షల వ్యయంతో నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లను అందించామని గుర్తు చేశారు. స్కూల్ భవనాలు నిర్మించేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. అధికారులు అంచనా వేసి అనుమతులు ఇస్తే నిర్మించేందుకు ఎన్నో సంస్థలు ముందుకు రావడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పది పరీక్షల్లో 10/10 సాధించిన విద్యార్థులకు లక్ష రూపాయలు అందించి, వారిని కళాశాలలో చేర్పించే బాధ్యత తీసుకుంటానన్నారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలనే లక్ష్యంతో ముందుకు వచ్చిన బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్, సిర్సస్ ల్యాబ్ సంస్థల ప్రతినిధులు కృష్ణ పోడిశెట్టి, వెంకటేశ్, ప్రేమ్‌కుమార్‌లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

పాఠశాలల స్థలాలను కబ్జా చేసే ఊరుకోం

నియోజకవర్గంలోని పాఠశాలలు కబ్జా అయితే ఊరుకునే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. అధికారులు కూడా కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అంజయ్యనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల రోడ్డును కబ్జా చేసి గుడిసెలు వేస్తే గతంలో కూల్చివేశారని, మళ్లీ ఇప్పుడు గుడిసెలు వేసినా అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గుడిసెలను తొలగించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ, హెచ్‌ఎం మల్లయ్య, ఉపాధ్యాయులు, నాయకులు నరేందర్‌గౌడ్, సయ్యద్ ఏజాజ్, కర్రె జంగయ్య, మక్కాల నర్సింగ్‌రావు, ఇర్ఫాన్, మేకల హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కార్తీక మాస పూజలు

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లోని పార్వతీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాస పూజలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. నెల రోజుల నుంచి శివనామ స్మరణతో ఆలయ ప్రాంతాలు మారుమ్రోగాయి. ప్రతి రోజు భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

10న గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు

ఆల్విన్‌కాలనీ: పాపారాయుడు నగర్, ఆస్‌బెస్టాస్ కాలనీ చివరి బస్టాండ్ వద్ద అశోక గార్డెన్స్‌లో శేరిలింగంపల్లి పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నారు. 10న మంగళవారం సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ క్రిస్మస్ వేడుకల్లో వర్తమానికులు రెవ. సుధాకర్ ప్రసంగించనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

అనాథలకు దుప్పట్లు, రగ్గుల పంపిణీ


చిన్నారులకు దుప్పట్లు, రగ్గులు అందజేస్తున్న సీఎస్ఆర్ మూర్తి తదితరులు

మోతీనగర్: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలోనే జీవితానికి సార్థకత లభిస్తుందని శ్రీశృంగేరి శారద శంకరమఠం మోతీనగర్ శాఖ ధర్మాధికారి సీఎస్ఆర్ మూర్తి అన్నారు. ఆదివారం రాత్రి సువర్ణభూమి మహోత్సవ, సేవా భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో రోడ్డుపై నివసిస్తున్న వయో వృద్ధులకు, అనాథ ఆశ్రమంలోని వృద్ధులు, చిన్నారులకు, ఓం సాయి వృద్ధుల ఆశ్రమంలో, పేద బాలికల ఆశ్రమంలో దుప్పట్లను అందజేశారు. సుమారు 400 మందికి దుప్పట్లు, రగ్గులను పంపిణీ చేశామని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా పలు సేవా కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు.

పాపమ్మ కాలనీ అభివృద్ధికి కృషి

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ


కాలనీ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: పాపమ్మ కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన కాలనీ ముఖద్వారాన్ని సోమవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. కాలనీలను అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతానన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాపమ్మ, రాంచందర్, వేలు, రాము, కృష్ణ, త్రినాథ్, వెంకటరావు, మాధవరావు, శ్రీను, కుమార్, నరేందర్, నందు, రామరాజు, జీవన్, రామకృష్ణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

స్ట్రాం వాటర్ డ్రైన్ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవీందర్ రెడ్డి తదితరులు

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్‌లో స్ట్రాం వాటర్ డ్రైన్ పనులను సోమవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజు కాలనీ, సాయినగర్, వినాయక్‌నగర్‌లలో వర్షపు నీరు పంచవటి అపార్టుమెంట్ వద్ద ఆగడం వల్ల రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోందన్నారు. పనులతో సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఏఈ సునీల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు, కాంట్రాక్టర్ శివారెడ్డి, నాయకులు ఎన్‌వీ రత్నం, ఎర్రం చంద్రశేఖర్ గుప్తా, నర్ర విజయేందర్ రెడ్డి, దిట్టకవి గౌతమ్, ఆవుల గ్రీష్మంత్ రెడ్డి, మహ్మద్ సోఫీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ



కూకట్‌పల్లి: హరిహర పుత్ర అయ్యప్ప స్వామి మహా పడిపూజను ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వామి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లక్ష పుష్పార్చనను దేదీప్యమానంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి మాల ధారణ స్వాములు నగరంలోని నలుమూలల నుంచి హాజరై అయ్యప్ప సంకీర్తన, పూజలతో హోరెత్తించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, గురుస్వామి వడ్డేపల్లి రాజేశ్వరరావు, అరుణ్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్న సమారాధన



కూకట్‌పల్లి: ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తైన సందర్భంగా కేపీహెచ్‌బీకాలనీ రెండవ రోడ్డులోని షిరిడీ సాయిబాబా ఆలయంలో అయ్యప్ప స్వాములకు సోమవారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, మమత, మంథస్ రాజీవ్ రెడ్డి, భువస్ రాజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య ప్రదర్శన



మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని ఎస్‌వీఎస్ కళానికేతన్ కూచిపూడి నృత్య ప్రదర్శన శాల ఆధ్వర్యంలో షిరిడీ సాయి మందిరంలో ఆదివారం రాత్రి నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పక్కనే ఉన్న మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో కూడా నృత్య ప్రదర్శన జరిగింది. షిరిడీ సాయి మందిరం కమిటీ సభ్యులు కూచిపూడి నృత్య గురువు దీపను, విద్యార్థులను సత్కరించారు.

ఫుల్ గాస్పల్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు


వేడుకలో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ శంషీగూడ పరిధిలోని ఫుల్ గాస్పల్ చర్చిలో ఆదివారం రాత్రి నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాస్టర్స్ పి. ఇశ్రాయిల్, ఎం.సత్యరాజు, రాజు, నాగభూషణం, దేవదాస్, బిషప్ శ్యామూల్, రాంబాబు, విల్సన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు సమగ్ర సర్వే!

- పూర్తి కావస్తున్న డోర్ లాక్ ఇళ్ల సర్వే
- వలస కుటుంబాలు స్థానిక ప్రాంతం వైపు మొగ్గుతో ఇబ్బందులు
- పలు అవాంతరాలతో సర్వే చేవడుతున్న ఎన్యుమరేటర్లు
- దాదాపు పూర్తయిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్ రూరల్ జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే తుది దశకు చేరింది. గత నెల 9న ప్రారంభమైన సర్వే ఇప్పటి వరకు 99 శాతం పూర్తైంది. ఒకటి, రెండు రోజుల్లో మొత్తం పూర్తికానుంది. మొత్తంగా 2800 మంది ఎన్యుమరేటర్లు, 242 మంది పర్యవేక్షకులు 21 రోజులుగా సర్వే చేస్తున్నారు. వాస్తవానికి నవంబర్ నెలాఖరులోగా సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాల్సి ఉన్నా ఎన్యుమరేటర్లకు పలు అవాంతరాలు, డోర్ లాక్ వంటి పరిస్థితుల నేపథ్యంలో ఒకటి, రెండు రోజులు ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. సమగ్ర సర్వే ఇంకా కొనసాగుతున్నా సంబంధిత వివరాల(డాటా)ను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను అధికార యంత్రాంగం ప్రారంభించింది.

- మేడ్చల్ రూరల్ జిల్లా పరిధిలోని ఐదు మండలాలు, 13 పురపాలక సంఘాల్లో సర్వే కార్యక్రమం చేపట్టగా, ఇప్పటి వరకు ఐదు మండలాలు, 6 మున్సిపాలిటీల్లో దాదాపు వంద శాతం సర్వే పూర్తైందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.
- జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్లతో సహా పలు మున్సిపాలిటీల్లో సమగ్ర సర్వే కార్యక్రమం కొనసాగుతోంది. డోర్ లాక్ ఇళ్లు ఉండటం వల్ల సర్వే చేయలేని పరిస్థితి నెలకొంది. వలస కుటుంబాల సంఖ్య కూడా అధికంగా ఉండటంతో వారంతా స్థానికంగా నిర్వహిస్తున్న సమగ్ర సర్వేలో తమ వివరాలు నమోదు చేసుకున్నామని దాట వేస్తున్నట్లు ఎన్యుమరేటర్లు పేర్కొంటున్నారు. దీంతో సర్వే కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయలేకపోతున్నట్లు తెలిపారు.

ప్రణాళికతో ముందుకు...

జిల్లా అధికార యంత్రాంగం సమగ్ర సర్వేను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఒక వైపు సమగ్ర సర్వే పనులు మరోవైపు ప్రభుత్వానికి సంబంధించిన ప్రాధాన్యత కార్యక్రమాలు ఉండటంతో కొంత ఒత్తిడికి గురైనట్లు తెలుస్తోంది. అయినా నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లడంతో విజయవంతం అయ్యారు.

- సర్వేలో ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, జూనియర్ అసిస్టెంట్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ, మెప్మా సిబ్బంది సహా ఇతరులు కూడా భాగస్వామ్యం అయ్యారు. అయితే పల్లెల్లో సర్వేకు ప్రజల నుంచి పూర్తి సహకారం అందగా.. పురపాలికల్లో ఎన్యుమరేటర్లు కొంత ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొన్నారు.
- పట్టణ ప్రజలు వారి సొంతూళ్లలోనే సర్వే చేయించుకోవడానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఇక పట్టణాల్లో నివాసం ఉంటున్న వారు సమగ్ర వివరాలు ఇవ్వలేదని తెలుస్తోంది.

55 శాతం ఆన్‌లైన్ నమోదు

ఒకవైపు సర్వే పనులు కొనసాగుతుండగానే మరోవైపు వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 55 శాతం సర్వే వివరాలను నమోదు చేసినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందుకోసం కంప్యూటర్లు అధికంగా ఉన్న కార్యాలయాల్లో ఆపరేటర్లను నియమించి వివరాలు నమోదు చేయిస్తున్నారు. సర్వే పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని జిల్లా అధికార యంత్రాంగం సూచనలు చేసింది.

చిరు వ్యాపారులే టార్గెట్‌గా వసూళ్ల పర్వం!

అమీర్‌పేట: రోడ్లు,కాలనీ బస్తీల్లో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాల్సిన శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్లు మామూళ్ల మత్తులో మునిగిపోతున్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి చిన్నా చితక వ్యాపారాలు చేసే వారిని టార్గెట్‌గా చేసుకుని నెల నెలా మామూళ్లు దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అధికారుల కనుసన్నల్లోనే ఈ దందా నడుస్తున్నట్లు తెలుస్తోంది. పారిశుద్ధ్య కార్మికులను సమన్వయం చేసుకుని పనులను పర్యవేక్షించాల్సిన కొందరు శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్లు ఇష్టానుసారంగా వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిసింది. ఏరియాతో సంబంధం లేకుండా అమీర్‌పేట, బల్కంపేట, సనత్‌నగర్ ఎస్ఆర్‌టీ, బీకేగూడ, మైత్రివనమ్, సత్యం థియేటర్ పరిసరాల్లో ఉన్న ఏ ఒక్క వ్యాపారినీ వదలడం లేదనే ఆరోపణలున్నాయి. ఫుడ్, ట్రేడ్ లైసెన్సుల పేరుతో వేలల్లో డబ్బులు దండుకుంటున్నారని ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఫాస్ట్ ఫుడ్ స్టాల్ నడిపే యువకుడు వాపోయాడు. డబ్బులు ఇవ్వకపోతే స్టాల్ మూసి వేయిస్తామని బెదిరిస్తుండడంతో చేసేదేమీలేక అడిగినంత ఇచ్చుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశాడు. పారిశుద్ధ్య కార్మికులను సైతం వీరు వేధిస్తున్నట్లు సమాచారం.ప్రమాదవశాత్తు, అనారోగ్యం కారణంగా ఎవరైనా చనిపోతే వారి స్థానంలో కుటుంబ సభ్యులను ఉద్యోగంలో పెట్టిస్తానని చెప్పి లక్షల్లో డబ్బులు తీసుకుని వేరే వ్యక్తులను పెట్టుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మామూళ్ల మత్తులో పారిశుద్ధ్య నిర్వాహణను అసలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు అధికారుల పాత్ర కూడా ఉండటం వల్లే ఇలా మితిమీరి వ్యవహరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. దీనిపై జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు లోతుగా విచారణ చేపట్టి సదరు ఫీల్డ్ అసిస్టెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఏఎంహెచ్‌ఓను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ఆక్రమణలను పరిశీలించిన హైడ్రా కమిషనర్


బేగంపేట ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్ పరిసరాల్లో పర్యటిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్ పరిసర ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సోమవారం పర్యటించారు. వెల్కిన్ పార్క్ అపార్ట్‌మెంట్స్ సమీపం నుంచి వెళ్తున్న రసాయన నాలాపై 1150 గజాల స్థలంలో ఆక్రమణలు ఉన్నాయని స్థానికులు కొందరు ఫిర్యాదు చేయడంతో రంగనాథ్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. బాలానగర్ నుంచి అంబర్‌పేటకు వెళ్తున్న రసాయన వ్యర్థాల నాలాపై కొందరు షెడ్లతో తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారనే ఫిర్యాదు మేరకు రంగనాథ్ వారితో మాట్లాడారు. అయితే కొందరు స్థానికులు తాము చట్టబద్ధంగానే ఉన్నామని, తమకు అన్ని అనుమతులు ఉన్నాయని రంగనాథ్ దృష్టికి తీసుకువచ్చారు. తగిన ఆధారాలు కలిగిన పత్రాలను తమ కార్యాలయానికి పంపాలని రంగనాథ్ స్థానికులకు సూచించారు.

గంజాయి విక్రేతకు రిమాండ్

మూసాపేట: గంజాయి అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... కూకట్‌పల్లి భాగ్యనగర్‌కాలనీ జయనగర్‌కు చెందిన కోసూరి తులసి రామరాజు (26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. బీటెక్ చదువుతున్నప్పటి నుంచి గంజాయి తాగడం అలవాటు ఉంది. 18 నెలల నుంచి నానక్‌రాం గూడ నుంచి తీసుకువచ్చి తాగుతూ, విక్రయిస్తుండేవాడు. అరకులోని తనకు తెలిసిన సుభాష్ అనే వ్యక్తి నుంచి 1 కిలో 400 కిలో గ్రాముల గంజాయి ఈ నెల 30వ తేదీన తీసుకువచ్చి 1వ తేది రాత్రి జయనగర్‌లోని విల్‌సన్ క్రికెట్ అకాడమీ వద్ద ముగ్గురికి అమ్ముతుండగా పోలీసులు అరెస్టు చేశారు. గంజాయిని స్వాధీనం చేసుకుని సోమవారం రిమాండ్‌కు తరలించారు.

అయ్యప్ప స్వాములకు సన్మానం

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలో శ్రీహరి హర క్షేత్ర దేవస్థానంలో కార్తీక మాసం ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం పాడ్యమి రోజున అభిషేకాల్లో పాల్గొన్న అయ్యప్ప స్వాములను దాతలు, కాలనీ వాసులు సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ డాక్టర్ పి.నాగిరెడ్డి, ప్రధాన అర్చకులు కృష్ణ సూరి, స్వాములు కల్యాణ్, కృష్ణ, సత్యనారాయణ, కొండల్ రెడ్డి, అశోక్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


స్వాములను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ నాగిరెడ్డి తదితరులు

తప్పుడు ప్రచారాన్ని కార్యకర్తలు తిప్పికొట్టాలి

- అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత బీఆర్‌ఎస్‌దే..
- హామీల అమలుపై ప్రత్యేక దృష్టి
- ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత



సమావేశంలో మాట్లాడుతున్న కాల్వ సుజాత

బాలానగర్: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని కార్యకర్తలు తిప్పికొట్టాలని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత పిలుపునిచ్చారు. ప్రజాపాలన విజయోత్సవ సన్నాహక సమావేశం సందర్భంగా సోమవారం బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పది సంవత్సరాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తుందన్నారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసిన ప్రభుత్వం దేశంలోనే ఎక్కడా లేదన్నారు. అప్పుల రాష్ట్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి మళ్లీ గాడిలో పెడుతున్నారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, పీసీసీ కార్యదర్శి సత్యం శ్రీరంగం, ఏ, బీ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, తూము వేణు, మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పారెడ్డి, నియోజకవర్గ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, గోపిశెట్టి రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.